సాక్షి వికారాబాద్

గురువారం । 23 । మే । 2024



కలవరపెడుతున్న నకిలీ!

నకిలీ విత్తనాలు, ఎరువుల అమ్మకాలపై జిల్లా అధికారులు నిఘా పెట్టినా యథేచ్ఛగా దందా సాగుతోంది.

8లో▸



వినూత్న శిక్ష

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ ముగ్గురికి వికారాబాద్ న్యాయస్థానం వినూత్న తీర్పు ఇచ్చింది.

8లో▸



మోక్షం కలిగేనా?

విశ్వనాథ్‌పూర్ సమీపంలో కాకరవేణి నదిపై 2005 చేపట్టిన శివసాగర్ ప్రాజెక్టు నేటికీ పూర్తికాలేదు.

9లో▸

న్యూస్‌రీల్

రేపటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

కుల్కచర్ల: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 24నుంచి 31వ తేదీ వరకు కొనసాగుతాయని కుల్కచర్ల శ్రీరామలింగేశ్వర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కామేశ్వరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు మొదటి సంవత్సరం విద్యార్థులకు, మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5:30గంటల వరకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఫస్టియర్‌లో 824మంది, సెకెండ్ ఇయర్‌లో 394మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

రేపు విత్తన మేళా

ఇబ్రహీంపట్నం: రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ వర్సిటీలో శుక్రవారం విత్తనాల మేళా(సీడ్స్ మేళా)ను నిర్వహిస్తున్నట్లు ఇబ్రహీంపట్నం వ్యవసాయ విస్తరణ అధికారి శ్రవణ్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ వర్సిటీలు, పలు కంపెనీల ఏజెన్సీలు, వివిధ రకాల నాణ్యమైన విత్తనాలను ఈ మేళాలో ప్రదర్శిస్తారని.. అవసరమైన వారు కొనుగోలు చేయవచ్చునన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మట్టి తరలింపుపై ఇరిగేషన్ శాఖ ఫిర్యాదు

కేశంపేట: నిబంధనలకు విరుద్ధంగా మట్టిని తరలిస్తున్నట్లు కేశంపేట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదయింది. ఈ ఘటన మండల పరిధిలోని బైర్కాన్‌పల్లి శివారులో బుధవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన ప్రకారం పోసముంద్రం చెరువులో ఓ రైతు ఇతర వ్యక్తుల సహకారంతో అక్రమంగా మట్టిని తరలిస్తున్నాడు. గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడకు చేరుకుని జేసీబీని స్వాధీనం చేసుకున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇరిగేషన్ శాఖ క్లస్టర్ లింగం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లింగం తెలిపారు.

కౌంటింగ్‌కు ఏర్పాట్లు

సాక్షి, సిటీబ్యూరో: ఎన్నికల కౌంటింగ్‌ను పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు హైదరాబాద్ పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులకు తెలిపారు. బుధవారం హైదరాబాద్ అబిడ్స్ జీహెచ్‌ఎంసీ సర్కిల్ ఆఫీసులో నిర్వహించిన గోషామహల్ అసెంబ్లీ సెగ్మెంట్ ఏంకోర్ డాటా ఎంట్రీ(డమ్మీ) రిహార్సల్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపును ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. కౌంటింగ్‌కు 14 టేబుల్స్ ఏర్పాటు చేసి కౌంటింగ్ ఏజెంట్ల సమక్షంలో ఓట్ల లెక్కింపు నిర్వహించాలని సూచించారు. ఎలాంటి సంఘటనలు జరగకుండా పటిష్టవంతంగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేశారు. గుర్తింపు కార్డు ఉన్నవారిని మాత్రమే లోపలికి అనుమతించాలని తెలిపారు. ఈ సమావేశంలో నోడల్ ఏఆర్‌ఓ విక్టర్, డిప్యూటీ కలెక్టర్ అండ్ ఏఆర్‌ఓ ఎస్. విద్యాధర్, తహసీల్దార్, ప్రేమ్ కుమార్, డేటా ఎంట్రీ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

నిఖత్ జరీన్‌కు సన్మానం

సాక్షి, సిటీబ్యూరో: ఇటీవల కజకిస్తాన్‌లో జరిగిన ఎలోర్డా కప్ పోటీల్లో 52 కేజీల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో విజేతగా నిలిచి బంగారు పతకం సాధించిన బాక్సర్ నిఖత్‌జరీన్ బుధవారం జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్‌ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో ఆమెను సత్కరించిన కమిషనర్, హైదరాబాద్ పేరు ప్రతిష్టలు దశ దిశలా వ్యాపించేలా, దేశ గౌరవం ఇనుమడించేలా ముమ్ముందు మరింతగా రాణించాలని అభిలషించారు. బాలబాలికల్లో క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించేందుకు జీహెచ్‌ఎంసీ కూడా కృషి చేస్తుండటాన్ని, సమ్మర్ కోచింగ్ క్యాంపులు నిర్వహిస్తుండటాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ స్పోర్ట్స్ విభాగం మాజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్సార్ ప్రేమ్‌రాజ్ పాల్గొన్నారు.

బీజేపీ నేతపై దాడికి యత్నం?

మీర్‌పేట: ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు కర్రలతో మంగళవారం రాత్రి బీజేపీ నాయకుడిని వెంబడించిన సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం. మీర్‌పేట నందిహిల్స్ పరిధిలోని చైతన్యహిల్స్‌కు చెందిన స్థానిక బీజేపీ నాయకుడు ద్యాసాని తిరుపతిరెడ్డి రాత్రి 11గంటలకు కారులో ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో ఓ ద్విచక్రవాహనంపై ముగ్గురు వ్యక్తులు కర్రలతో కారును వెంబడించారు. గమనించిన తిరుపతి రెడ్డి ఇంటి వద్ద వాహనం దిగకుండా ముందుకు వెళ్లడంతో వచ్చిన వ్యక్తులు వెళ్లిపోయారు. తిరుపతి రెడ్డి డయల్ 100కు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటనా స్థలికి వచ్చి పరిశీలించి కేసు నమోదు చేశారు.

వికారాబాద్ మండలం బూర్గుపల్లి శివారులో మామిడి తోటను నరికి ప్లాట్లు చేస్తున్న దృశ్యం



రియల్ మాయ

యథేచ్ఛగా ఫాం లేఅవుట్స్



ఈ ఫొటోలో కనిపిస్తున్న పొలం పరిగి మండలం నస్కల్ రెవెన్యూ పరిధిలోనిది. పరిగి – వికారాబాద్ మార్గంలో ఉంది. రోడ్డుకు దగ్గరగా ఉండటంతో ఇటీవల కొందరు రియల్ వ్యాపారులు తోటను కొనుగోలు చేశారు. మామిడి చెట్లను నరికితే ఇబ్బందులు ఎదురవుతాయని భావించి తోటకు నిప్పు పెట్టారు. దీంతో చెట్లు ఎండిపోయాయి. ఆ తరువాత వాటిని నరికి రోడ్లు వేసి ఫాం లేఅవుట్‌గా మారుస్తున్నారు.

- నాలా కన్వర్షన్ చేయకుండానే ప్లాట్లు చేసి విక్రయాలు
- పంచాయతీ అనుమతులు లేకుండానే బీటీ రోడ్లు
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు

వికారాబాద్: వ్యవసాయ భూములను ప్లాట్లు చేయాలన్నా.. గజాల లెక్కన విక్రయించాలన్నా.. ముందుగా ఆ భూమికి సంబంధించి నిర్దేశిత రుసుం చెల్లించాలి. అనంతరం వ్యవసాయేతర భూమిగా కన్వర్షన్ చేసుకోవాలి. నాలా తరువాత ఆ భూమి వ్యవసాయ భూమి నుంచి కమర్షియల్ పర్పస్ ల్యాండ్‌గా మారుతుంది. అయితే వ్యవసాయ యోగ్యంగా లేని భూములను మాత్రమే నాలా కన్వర్షన్ చేయాలనే నిబంధన ఉంది. కాగా నాలా కన్వర్షన్ చేయకుండానే జిల్లాలో పలు చోట్ల వ్యవసాయ భూములను గజాల లెక్కన విక్రయించి.. గుంటల చొప్పున రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. ప్రభుత్వ రుసుం చెల్లించకుండానే లేఅవుట్‌గా మార్చి విక్రయిస్తున్నారు. దీంతో సర్కారు ఆదాయానికి పెద్ద ఎత్తున గండి పడుతోంది.

నాలా చట్టానికి తూట్లు

నాలా కన్వర్షన్ చేయకుండానే వ్యవసాయ భూములను ప్లాట్లు చేసి అమ్మేస్తున్నారు. ఏకంగా పొలాల్లో బీటీ, సీసీ రోడ్లు వేసి నాలా చట్టానికి తూట్లు పొడుస్తున్నారు. అనుమతులు లేకుండా పక్కా నిర్మాణాలు చేపడుతున్నారు. కొన్ని చోట్ల చెరువులు, నాలాలు సైతం కబ్జా చేస్తున్నారు. ఫాం లేఅవుట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నా రెవెన్యూ, పంచాయతీ, టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫిర్యాదులు, ఆరోపణలు వచ్చిన చోట మాత్రమే నోటీసులతో సరిపెడుతున్నారు.

ప్రభుత్వ ఖజానాకు గండి

నిన్నమొన్నటి వరకు గ్రామ పంచాయతీ కేంద్రాలు, మున్సిపల్ పరిసరాల్లో మాత్రమే అక్రమ లేఅవుట్లు ఉండేవి.. నేడు ఈ వ్యవహారం వ్యవసాయ పొలాల వరకు పాకింది. రియల్ ఎస్టేట్ వ్యాపారులు రైతులకు డబ్బు ఆశ చూపి పచ్చటి పొలాలను ఎలాంటి అనుమతులు లేకుండానే ఫాం లేఅవుట్లుగా మార్చేస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి పడుతోంది. అంతేకాకుండా యథేచ్ఛగా చెట్లను నరికి వేస్తుండటంతో పర్యావరణానికి ముప్పు కలుగుతోంది.

పై ఫొటోలో కనిపిస్తున్న మామిడి చెట్లు వికారాబాద్ మండలం బూర్గుపల్లి శివారులోనివి. పదేళ్ల క్రితం నుంచి ఓ రైతు తోటను పెంచుతున్నాడు. ఇక్కడ కాసే మామిడి పండ్లు చాలా ప్రసిద్ధి. అయితే ఇటీవల తోటను రైతు వేరే వారికి విక్రయించాడు. ఆరు నెలలు తిరిగేలోగా చెట్లను మొత్తం నేలమట్టం చేశారు. పొలాన్ని వెంచర్‌గా మార్చి ప్లాట్లు చేస్తున్నారు. ఇవి కేవలం ఉదాహరణలు మాత్రమే. ప్రధాన రహదారులకు సమీపంలోని వ్యవసాయ పొలాలే టార్గెట్‌గా రియల్ వ్యాపారులు ముందుకు సాగుతున్నారు. సాగు భూములను ఫాం లేఅవుట్లుగా మార్చి సొమ్ము చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

పట్టించుకోని అధికారులు

అక్రమ లేఅవుట్లపై ఉక్కుపాదం మోపాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. కొన్ని చోట్ల రియల్టర్లతో కుమ్మక్కయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని జీపీలు, మున్సిపాలిటీల్లో పంచాయతీల అనుమతులు లేకుండా ఫాం లేఅవుట్లు ఏర్పాటు చేసి నిర్మాణాలు చేపడుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

జిల్లాలోని పలుచోట్ల అనుమతులు లేకుండా లేఅవుట్లు చేస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. కొన్ని గ్రామ పంచాయతీల్లో అక్రమ వెంచర్లపై రియల్టర్లకు నోటీసులు ఇచ్చాం. మరి కొన్ని చోట్లు మూడుసార్లు నోటీసులు అందజేశాం. వారు స్పందించకుంటే తదుపరి చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే కొన్ని చోట్ల అక్రమ నిర్మాణాలను కూల్చేశాం. ఎక్కడైనా పంచాయతీ కార్యదర్శుల పాత్ర ఉన్నట్లు తేలితే వారిపైనా చర్యలు ఉంటాయి.

– జయసుధ, డీపీఓ, వికారాబాద్

కొలతలు లేకుండా దుస్తులా?

- ఇష్టం వచ్చినట్లు విద్యార్థుల డ్రస్ కుడితే ఒక్కరూపాయి ఇవ్వం
- ఏపీఎం బాలయ్యపై కలెక్టర్ ఆగ్రహం

పెద్దేముల్: విద్యార్థుల కొలతలు తీసుకున్న తరువాతే ఏక రూప దుస్తులు కుట్టించాలని పదే పదే చెబుతున్నాం.. అయినా మీకు పట్టడం లేదు.. మీలో మార్పు వచ్చేది ఎప్పుడో.. కొలతలు లేకుండా దుస్తులు కుడితే ఒక్క రూపాయి ఇచ్చేది లేదని కలెక్టర్ నారాయణరెడ్డి స్పష్టం చేశారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో టైలరింగ్ షాపుల్లో విద్యార్థుల కోసం తయారవుతున్న ఏక రూప దుస్తులను కలెక్టర్ పరిశీలించారు. అదే మీ పిల్లలు అయితే ఇలాగే కుట్టించుకుంటారని ప్రశ్నించారు. ఎంత మంది విద్యార్థులకు ఏయే సైజుల్లో దుస్తులు కుడుతున్నారని టైలరింగ్ సెంటర్ వారిని అడగ్గా ఐకేపీ అధికారులు కొన్ని సైజులు చెప్పారని, కొరత ఇవ్వాలేదని వివరించారు. కేవలం తరగతి, విద్యార్థుల సంఖ్యను రాసి ఇవ్వడం చూసి ఏపీఎం బాలయ్యపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను ఎన్ని సార్లు చెప్పినా ఎందుకు వినడం లేదు, టైం పాస్ చేస్తున్నారా అని మండిపడ్డారు. సాయంత్రంలోగా విద్యార్థుల కొలతలు టైలరింగ్ షాపుల్లో ఉండాలని లేకుంటూ చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం మన్‌సాన్‌పల్లి, మంబాపూర్‌లోని అమ్మ ఆదర్శ పాఠశాలలను సందర్శించారు. అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ నెల చివరి నాటికి అన్ని పనులు పూర్తి కావాలని మండల అధికారులకు ఆదేశించారు. మండలంలో 58 పాఠశాలలు ఉండగా మొదటి విడతలో 37 పాఠశాలలకు, రెండో విడతలో 16 పాఠశాలలకు అమ్మ ఆదర్శ పథకం కింద రూ.2.5 కోట్లు మంజూరైనట్లు పంచాయతీ రాజ్ ఏఈ సిద్ధార్థ కలెక్టర్‌కు వివరించారు. ఈ నిధులతో మరుగుదొడ్లు, తాగునీటి వసతి, విద్యుత్ సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఆర్‌ఓ కిషన్, ఎంపీడీఓ జర్నప్ప, ఎంఈఓ వెంకటయ్య, ఎంపీఎం బాలయ్య, మన్‌సాన్‌పల్లి మాజీ సర్పంచ్ రుక్కిబాయి పాల్గొన్నారు.

31లోగా ధాన్యం కొనుగోలు పూర్తి కావాలి

పెద్దేముల్: ఈ నెల 31లోగా ధాన్యం కొనుగోలు పూర్తి కావాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. బుధవారం మండలంలోని మంబాపూర్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వర్షాలు పడుతున్నందున రైతులకు ఇబ్బందులు రాకుండా త్వరగా కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలని డీసీఎంఎస్ అధికారులకు సూచించారు. ధాన్యం డబ్బు వారం రోజుల్లో రైతుల ఖాతాల్లో జమ అవుతుందని చెప్పారు. తేమ శాతం సరిగ్గా ఉండేలా చూసుకోవాలని రైతులకు సూచించారు. అవసరం అయితే కులీల సంఖ్యను పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్, మండల అధికారులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించండి

యాలాల: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. బుధవారం మండల కేంద్రంలోని పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. బాలికల ఉన్నత పాఠశాలలో తాగునీటి కోసం ఏర్పాటు చేసిన కుళాయిలు సరిగ్గా లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. తరగతి గదుల్లో కరెంటు సరఫరాపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలల ప్రారంభం నాటికి అన్ని పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. బాలుర ప్రాథమిక పాఠశాల మరుగుదొడ్ల వద్ద నీటి సౌకర్యం లేకపోవడంపై హెచ్‌ఎంపై మండి పడ్డారు. విద్యార్థుల కొలతలు తీసుకున్న తరువాతే యూనిఫాం కుట్టించాలని ఆదేశించారు.

ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి

అంతకుముందు బెన్నూరు వరి కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యాన్ని సేకరించాలన్నారు. పూర్తిగా ఆరబెట్టిన వడ్లను కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని రైతులకు సూచించారు. అవసరం మేరకు గన్నీ బ్యాగులను అందుబాటులో ఉంచాలన్నారు. కూలీల సంఖ్యను పెంచి సేకరించిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని, ఇందుకు అవసరమైన వాహనాలను సమకూర్చుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్డీఓ శ్రీనివాస్, పౌరసరఫరాల శాఖ అధికారి రాజేశ్వర్, జిల్లా మేనేజర్ సుగుణబాయి, ఎంపీడీఓ పుష్పలీల, ఎంఈఓ సుధాకర్‌రెడ్డి, ఏపీఎం ప్రమీల, పీఆర్ ఏఈ వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పెద్దేముల్: విద్యార్థుల ఏకరూప దుస్తులపై సూచనలు ఇస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

యథేచ్ఛగా 'బెల్ట్' దందా

- నిత్యం లక్షల్లో వ్యాపారం
- అధిక ధరలకు విక్రయం
- పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు

అనంతగిరి: గ్రామాల్లో బెల్ట్ షాపులు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. కిరాణా దుకాణాల్లో మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. నిత్యం లక్షల్లో వ్యాపారం జరుగుతున్నా ఎక్సైజ్ అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. ఓ గ్రామంలో రోజూ రూ.లక్ష వరకు మద్యం విక్రయాలు జరుగుతున్నాయంటే బెల్ట్ షాపుల్లో గిరాకీ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. వికారాబాద్ మండలంలో 21 గ్రామాలు ఉన్నాయి. చాలా గ్రామాల్లో బెల్టు షాపులను నిర్వహిస్తున్నారు. అధిక ధరలకు మద్యం విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. బెల్ట్ షాపుల కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పచ్చటి గ్రామాల్లో మందుబాబుల కారణంగా తరచూ గొడవలు జరుగుతున్నాయని పలువురు తెలిపారు. వైన్స్ షాప్ నిర్వాహకులే నేరుగా గ్రామాలకు మద్యం సరఫరా చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఉదయం దుకాణం తెరిచింది మొదలు అర్ధరాత్రి వరకు గ్రామాల్లో మద్యం దొరుకుతోంది. కావాల్సిన బ్రాండ్లను అందుబాటులో ఉంచుతున్నారు.



వికారాబాద్ మండలంలోని ఓ కిరాణా దుకాణంలో మద్యం బాటిల్

వికారాబాద్‌లో రాత్రి 10గంటలకు వైన్ షాపులను మూసివేస్తున్నారు. ఆ తర్వాత మందు కావాల్సిన వారు పట్టణ శివారు ప్రాంతాల్లోని దుకాణాల్లో, దగ్గరగా ఉన్న గ్రామాల వెళ్లి మందు కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటికైనా ఎక్సైజ్ అధికారులు బెల్ట్ షాపులపై దృష్టి సారించి వాటిని కట్టడి చేయాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

'అంగన్‌వాడీ'ల ప్రక్షాళనకు కసరత్తు

- టీచర్లు, ఆయాలకు వయో పరిమితి
- 65 ఏళ్లు నిండిన వారికి రిటైర్మెంట్
- జూన్ నుంచి అమలుకు కసరత్తు
- ప్రభుత్వానికి చేరిన జాబితా
- జిల్లాలో ఖాళీ కానున్న 152 పోస్టులు
- కొత్త వారిని నియమించే అవకాశం

తాండూరు: అంగన్‌వాడీ కేంద్రాల ప్రక్షాళనకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. దశాబ్దాలుగా విధులు నిర్వహిస్తూ వయోభారంతో ఉన్న టీచర్లు, ఆయాలకు ఉద్యోగ విరమణ కల్పించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత నెలలోనే ఈ ప్రక్రియ ప్రారంభం కావాల్సి ఉన్నా.. లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా వాయిదా పడింది. పార్లమెంట్ ఎన్నికలు పూర్తి కావడంతో అంగన్‌వాడీల వివరాలను సేకరిస్తోంది. జిల్లాలో 65 ఏళ్ల పైబడిన 152 మంది అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ఉన్నారు. వీరంతా ఉద్యోగ విరమణ పొందనున్నారు.

196 పోస్టులు ఖాళీ

జిల్లాలో 1,107 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటి ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందుతోంది. చిన్నారులకు విద్యను అందిస్తున్నారు. మరోవైపు ప్రభుత్వ కార్యక్రమాల్లో అంగన్‌వాడీ టీచర్ల పాత్ర కీలకంగా ఉంటుంది. జిల్లాలో 1,063 మంది అంగన్‌వాడీ టీచర్లు, 872 మంది ఆయాలు విధులు నిర్వహిస్తున్నారు. 44 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మరో 152 మంది ఉద్యోగ విరమణ పొందనున్నారు. దీంతో జిల్లాలో మొత్తం 196 పోస్టులు ఖాళీగా ఏర్పడనున్నాయి. వీరి స్థానంలో కొత్త వారిని నియమించనున్నట్లు తెలిసింది. తద్వారా అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.



మండలాల వారీగా ఖాళీలు

జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో 65 ఏళ్ల వయసు పైబడిన టీచర్ల వివరాలను ఐసీడీఎస్ అధికారులు సేకరించారు. కొడంగల్‌లో 23 మంది, మర్పల్లిలో 20 మంది, పరిగిలో 23 మంది, తాండూరులో 45 మంది, వికారాబాద్‌లో 41 మంది ఉద్యోగ విరమణ పొందనున్నారు. ఈ జాబితాను జిల్లా అధికారులు ప్రభుత్వానికి పంపారు.

పుట్టిన తేదీపై పేచీ

అంగన్‌వాడీ కేంద్రాల్లో 65 ఏళ్ల వయసు పైబడని వారు 152 మంది ఉన్నారు. వీరంతా వచ్చే నెలలో ఉద్యోగ విరమణ పొందనున్నారు. అయితే కొంత మంది మాత్రం పుట్టిన తేదీ సరిగ్గా లేని కారణంగా తాము తొందరగా విధుల నుంచి తప్పుకోవాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. న్యాయం చేయాలంటూ కొందరు అధికారులను ఆశ్రయించారు. వయస్సు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్నారు. పుట్టిన తేదీ సరిగ్గా లేని వారిని జిల్లా ఆస్పత్రిలో వయసు నిర్ధారణ పరీక్షలు చేయించుకునేందుకు అధికారులు అవకాశం కల్పించారు.

రిటైర్మెంట్ బెనిఫిట్స్‌పై చిన్నచూపు

అంగన్‌వాడీ కేంద్రాల్లో విధులు నిర్వహిస్తూ మరణించిన వారు అనేకం. అలాంటి వారికి ప్రభుత్వం నుంచి అనుకున్న మేర సాయం అందడం లేదు. ప్రభుత్వ తాజా ఉత్తర్వులతో హఠాత్తుగా ఉద్యోగాలు కోల్పోతే మా పరిస్థితి ఏమిటని అంగన్‌వాడీలు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం ఉద్యోగ విరమణ చేసే అంగన్‌వాడీ టీచర్లకు రూ.లక్ష, ఆయాలకు రూ. 50 వేలు ఇచ్చి చేతులు దులుపుకుంటోంది. ప్రభుత్వం సాయం ఏమాత్రం సరిపోదని టీచర్లు, ఆయాలు అంటున్నారు. అంగన్‌వాడీలకు రూ.5 లక్షలు, ఆయాలకు రూ.3 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రభుత్వానికి జాబితా

అంగన్‌వాడీ కేంద్రాల్లో 65 ఏళ్ల వయసు పైబడిన టీచర్లు, ఆయాల వివరాలను ప్రభుత్వానికి అందించాం. జిల్లాలో 152 మంది ఉద్యోగ విరమణ పొందనున్నారు. అయితే పలువురు సిబ్బంది తమకు రిటైర్మెంట్ వయసు రాలేదని అంటున్నారు. అలాంటి వారు వయసు నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించాం.

– జ్యోతిపద్మ, డీడబ్ల్యూఓ



తడిసి మొలకెత్తిన ధాన్యం

వరి కుప్పలు.. తిప్పలు

ఇబ్రహీంపట్నం: ఆరుగాలం శ్రమించి పంట పండించే అన్నదాతలకు అవస్థలు తప్పడంలేదు. విద్యుత్, సాగు నీటి కొరతలతో సతమతమై రేయింబవళ్లు కష్టపడి పంట పండిస్తే.. అధికార యంత్రాంగ సకాలంలో ధాన్యం సేకరించడంలో విఫలమవుతోంది. రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల వద్దే రైతులు పడిగాపులుకాస్తున్నారు. ధాన్యం తరలించడంలో జాప్యంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మండల పరిధిలోని రాయపోల్, దండుమైలారం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ఇబ్బందులు వర్ణణాతీతం. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారే తప్ప మౌలిక సదుపాయల కల్పనలో విఫలమయ్యారని రైతులు ఆరోపిస్తున్నారు. హమాలీల కొరత, ధాన్యం లోడ్‌ను తీసుకెళ్లే లారీలను, వడ్లను తూర్పార బట్టే యంత్రాలు అందుబాటులో ఉంచక రైతులు ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు అకాల వర్షాలు అన్నదాతను మరింత ఇబ్బంది పెడుతున్నాయి. కొనుగోలు కేంద్రాల వద్దనే ధాన్యం తడిసి మొలకెత్తుతోంది. ఒక్క టార్పాలిన్ కవర్‌కు రోజుకు రూ.35 అద్దె చెల్లించి ధాన్యం తడవకుండా కప్పుతున్నారు. అదేవిధంగా గంటకు రూ.వెయ్యి చెల్లించి వడ్లను తూర్పార బట్టిస్తున్నారు. గిట్టుబాటు ధరను చూసుకుంటే మరింత నష్టాలకు గురికావాల్సివస్తుందని కొంతమంది రైతులు ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకే ధాన్యాన్ని విక్రయించారు. ప్రభుత్వ యంత్రాంగం కొనుగోలు కేంద్రానికి వచ్చిన ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా సేకరించి మిల్లులకు తరలించాలని రైతులు వేడుకుంటున్నారు.

క్లుప్తంగా

సీజ్‌ చేసిన ఇసుక వేలం

తాండూరు టౌన్‌: మండల పరిధిలో సీజ్‌ చేసిన ఇసుకను ఈనెల 24న బహిరంగ వేలం వేయనున్నట్లు తహసీల్దార్‌ తారాసింగ్‌ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. తాండూరు మండలం చెన్‌గేష్‌పూర్‌ గ్రామంలోని సర్వే నంబర్‌ 83లో నిల్వ చేసిన 101 ట్రాక్టర్ల ఇసుకను సీజ్‌ చేశామన్నారు. ఇట్టి ఇసుకను సీజ్‌ చేసిన స్థలంలోనే శుక్రవారం బహిరంగ వేలం వేయనున్నట్లు చెప్పారు. ఆశావహులు పాల్గొనాలని తహసీల్దార్‌ తెలిపారు.

బీఆర్‌ఎస్‌ నేతలపై అట్రాసిటీ కేసు

అక్రమం అంటూ డీఎస్పీ కార్యాలయాన్ని ముట్టడించిన నాయకులు

పరిగి: ఎలాంటి ఎంక్వైరీ లేకుండానే అట్రాసిటీ కేసులు ఎలా నమోదు చేస్తారని బుధవారం పరిగి డీఎస్పీ కార్యాలయం ఎదుట భారీగా జనాలు గుమిగూడారు. పూడూర్‌ మండలం కడ్మూర్‌ గ్రామంలో ఈనెల 13న జరిగిన పార్లమెంట్‌ ఎన్నికల్లో కాంగ్రెస్‌, బీఆర్‌ఎస్‌ నాయకుల మధ్య మాటల యుద్ధం జరిగింది. దీంతో గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్‌ నేతలు సురేష్‌, మాణిక్యం, లింగం, రవికుమార్‌, మహేందర్‌లపై ఈనెల 14న పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు బుధవారం ఉదయం నలుగురిని అరెస్ట్‌ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గ్రామానికి చెందిన పలువురు పూడూర్‌ పోలీస్‌స్టేషన్‌ ముట్టడి చేసి అక్కడినుంచి పరిగి డీఎస్పీ కార్యాలయానికి తరలివచ్చి అక్రమంగా ఎందుకు అరెస్టు చేశారని నిలదీశారు. అధికార పార్టీ ఇష్టానుసారంగా అక్రమంగా నలుగురిపై అట్రాసిటీ కేసు ఎలా చేస్తారన్నారు. అధికార కాంగ్రెస్‌ పార్టీ నాయకులు కావాలనే బీఆర్‌ఎస్‌ నాయకులపై అక్రమంగా కేసులు నమోదు చేస్తున్నారన్నారు. ఈ విషయం మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా మాజీ ఎమ్మెల్యే డీఎస్పీ కార్యాలయానికి వచ్చి పోలీసు అధికారులతో వివరాలు అడిగి తెలుసుకుని వెళ్లారు.

25, 26 తేదీల్లో 'సమ్మర్‌ డే క్యాంప్‌'

గచ్చిబౌలి: కొండాపూర్‌లోని బొటానికల్‌ గార్డెన్‌లో ఈ నెల 25, 26వ తేదీల్లో 'సమ్మర్‌ డే క్యాంప్‌' నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇందులో అందరికీ అవకాశం కల్పిస్తారు. ఒక్కొక్కరు రూ.499 చెల్లించాల్సి ఉంటుంది. ఇందులో భాగంగా ప్రకృతిలో విహరించేందుకు అవకాశం కల్పించడమే కాకుండా థీమ్‌ పార్కుల సందర్శించేందుకు ఏర్పాట్లు చేశారు. గోల్ఫ్‌ కోర్సు ఆడేందుకు కూడా అవకాశం కలిప్తారు. ప్రకృతి, పర్యావరణ విద్యకు సంబంధించిన చిన్న నిడివి కలిగిన వీడియోలను తిలకించవచ్చు. ఆహ్లాదాన్ని పంచే అడ్వెంచర్‌ గేమ్స్‌లో పాల్గొనేందుకు కూడా అవకాశం కల్పించేందుకు ఏర్పాట్లు చేశారు. వివరాలకు 94935 49399, 93463 64583లను సంప్రదించవచ్చు.

25న 'నేచర్‌ క్యాంప్‌'

బొటానికల్‌ గార్డెన్‌ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా నేచర్‌క్యాంప్‌–ఫారెస్ట్రైక్‌పార్క్‌ కార్యక్రమాన్ని కూడా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ క్యాంప్‌లో టీమ్‌ బిల్డింగ్‌ యాక్టివిటీస్‌, టెంట్లలో క్యాంపు నిర్వహణ, ఫైర్‌క్యాంప్‌, నేచర్‌వాక్‌, ట్రెక్కింగ్‌, బర్డ్‌వాక్‌, వంటివి ఏర్పాటు చేస్తారు. 25వ తేదీన సాయంత్రం 4 గంటలకు పాల్గొనే వారు ఈ క్యాంప్‌లో చేరవచ్చు తిరిగి మరుసటి రోజు ఉదయం 10 గంటల వరకు క్యాంప్‌ను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఇందులో పాల్గొనేవారు 12 ఏళ్లు పైబడిన వారు రూ.1800, 5 నుంచి 12 ఏళ్లున్న వారు రూ.1200 చెల్లించాల్సి ఉంటుంది.

ఠాణా ఎదుట ద్విచక్ర వాహనం దగ్ధం



పంజగుట్ట: పంజగుట్ట పోలీస్‌ స్టేషన్‌ బయట పార్కింగ్‌లో స్థలంలో ద్విచక్ర వాహనం మంటల్లో కాలిపోయింది. ఈ వాహనం పక్కనే ఉన్న మరో వాహనం పాక్షికంగా ధ్వంసమైంది. పోలీసుల సమాచారం మేరకు.. అంబర్‌పేటకు చెందిన మహ్మద్‌ హమీద్‌ అనే వ్యక్తి తన ద్విచక్ర వాహనాన్ని పంజగుట్ట పోలీస్‌స్టేషన్‌ బయట పార్క్‌ చేసి పని నిమిత్తం బోయిన్‌పల్లికి వెళ్లాడు. మధ్యాహ్నం వాహనంలోంచి ఒక్కసారిగా పెద్ద ఎత్తున మంటలు రాసాగాయి. గమనించిన పోలీసులు, స్థానికులు మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అప్పటికే వాహనం కాలిపోయింది. పక్కనే ఉన్న మరో వాహనం పాక్షికంగా కాలింది. సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. బయటకు వెళ్లే వ్యక్తి ఠాణా ఎదుట వాహనాన్ని ఎందుకు పార్క్‌ చేశాడు? అనే అంశాన్ని ఆరా తీస్తున్నామన్నారు.

వీసీగా శైలజా రామయ్యర్‌ బాధ్యతల స్వీకరణ

నాంపల్లి: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వీసీగా ఐఏఎస్‌ అధికారిణి శైలజా రామయ్యర్‌ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ నెల 21వ తేదీతో రాష్ట్రంలోని వీసీల పదవీకాలం ముగియడంతో రాష్ట్ర ప్రభుత్వం ఐఏఎస్‌ అధికారులను ఆయా విశ్వవిద్యాలయాలకు ఇన్‌చార్జి వీసీలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన విషయం విదితమే.

కలవర పెడుతున్న నకిలీ!

ఆరుగాలం శ్రమించే అన్నదాతలకు నకిలీ విత్తనాల బెడద కలవర పెడుతోంది. దీని కట్టడికి వ్యవసాయ అధికారులు చర్యలు తీసుకుంటున్నా అక్రమార్జనే ధ్యేయంగా ఎంచుకున్న దళారులు చాప కింద నీరులా పుట్టుకొస్తున్నారు. కానీ విత్తన కొనుగోలులో రైతులు కొన్ని జాగ్రత్తలు పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు.

- అమ్మకానికి సిద్ధంగా పత్తి విత్తనాలు
- ఆరేళ్లుగా నష్టపోతున్న అన్నదాతలు
- కొనుగోలులో జాగ్రత్తలు తప్పనిసరి



నకిలీ విత్తనాలను స్వాధీనం చేసుకుని వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు (ఫైల్‌)

దౌల్తాబాద్‌: నకిలీ విత్తనాలు, కల్తీ పురుగు మందులు, ఎరువుల అమ్మకాలపై జిల్లా అధికారులు నిఘా పెట్టినా యథేచ్ఛగా దందా సాగుతుంది. అసలే వానాకాలం సీజన్‌ పైగా కల్తీ చేసే అవకాశం ఎక్కువ ఉంది. దీంతో బహిరంగంగా మార్కెట్లో ప్రవేశించే మందులు, విత్తనాల క్రయవిక్రయాలను అధికారులు పరిశీలించనున్నారు. లైసెన్స్‌ దుకాణాల్లో కొనాలని సూచిస్తున్నా రైతన్నలు ఆ నిబంధనను పట్టించుకోవడంలేదు. ఇందుకుగాను జిల్లాలో వ్యవసాయశాఖ ఏడీఏ స్థాయి అధికారులు విత్తన మాఫియాను అరికట్టేందుకు అవసరమైన ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. మండలంలో ఈ సంవత్సరం సుమారు 20వేల ఎకరాల్లో పత్తిని సాగు చేయడానికి సిద్ధంగా ఉన్నారు. అందుకుగాను విత్తనాల అవసరం ఉంది. కానీ మార్కెట్లోకి రోజుకో కొత్త కంపెనీ విత్తనాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. దళారులు చెప్పే మాయ మాటలు నమ్మి విత్తనాలు కొని చాలా మంది అన్నదాతలు నష్టపోతున్నారు. కానీ విత్తన మాఫియా రైతులను మోసగించి రూ.లక్షలు ఆర్జిస్తోంది. ఇటీవల కుదురుమళ్ల గ్రామంలో సుమారు 6 క్వింటాళ్ల నకిలీ విత్తనాలు వ్యవసాయధికారులు స్వాధీనం చేసుకున్నారు.

గతంలో అనేక ఘటనలు

నాలుగేళ్ల క్రితం మండల పరిధిలోని కుదురుమళ్ల గ్రామంలో పోలీసులు, వ్యవసాయధికారులు దాడులు నిర్వహించి దాదాపు పది క్వింటాళ్ల నకిలీ విత్తనాలు పట్టుకున్నారు. మహబూబ్‌నగర్‌ జిల్లా బూత్‌పూర్‌ ప్రాంతంలో ఉన్న సీడ్‌ కంపెనీల నుంచి ఈ ప్రాంత రైతులు పెద్ద మొత్తంలో పత్తి విత్తనాలు కొనుగోలు చేస్తారు. అలాగే రెండేళ్ల క్రితం గోకఫసల్‌వాద్‌ గ్రామంలో సుమారు 8 క్వింటాళ్ల విత్తనాలు పట్టుకున్నారు. ఏడాది క్రితం టాస్క్‌ఫోర్సు పోలీసులు ఏపీలోని నెల్లూరు జిల్లాకు చెందిన ఓ వ్యాపారి వద్ద 60 కిలోల నకిలీ పత్తి విత్తనాలు పట్టుకుని నిందితుల్ని రిమాండ్‌ చేశారు. ఈ మేరకు నకిలీ విత్తనాలు యథేచ్ఛగా విక్రయించడంతో మండలంలోని ఓ ఆంధ్ర వ్యాపారి మీద పీడీ యాక్ట్‌ పెట్టి జైలుకు పంపిన ఉదంతాలు ఉన్నాయి.

గుర్తించాల్సిన అంశాలు ఇవే

- విత్తనాల విక్రయాలకు అనుమతి ఉన్న డీలర్‌ నుంచి మాత్రమే కొనుగోలు చేయాలి.
- సంచిపై విత్తన రకం బ్యాచ్‌ నంబరు, గడువు తేదీని రైతులు గమనించాలి.
- ప్రముఖ కంపెనీల విత్తనాల సంచులపై సదరు సంస్థ ప్రత్యేకమైన హోలోగ్రామ్‌ ఉందో లేదో గుర్తించాలి.
- డీలరు నుంచి విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు తప్పకుండా రసీదు పొందాలి.
- రసీదులో దుకాణం నంబరు కొనుగోలు చేసిన సంచిపై ఉన్న వివరాలు నమోదు చేశారా లేదా అనే విషయాలను చూసుకోవాలి.
- పంట చేతికొచ్చే వరకు రసీదులు భద్రపర్చుకోవాలి.

డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌లో వినూత్న శిక్ష

వృద్ధులకు మందులు కొనుగోలు చేయాలన్న జడ్జి

అనంతగిరి: డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌లో పట్టుబడ్డ ముగ్గురికి వికారాబాద్‌ న్యాయస్థానం వినూత్న తీర్పు ఇచ్చింది. వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 20న వికారాబాద్‌ మున్సిపల్‌ పరిధిలో పోలీసులు డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌ చేపట్టారు. ఈ డ్రైవ్‌లో ముగ్గురు మద్యం తాగి పట్టుబడ్డారు. కాగా బుధవారం వికారాబాద్‌ స్పెషల్‌ మార్నింగ్‌ కోర్టు మెజిస్ట్రేట్‌ ఎదుట హాజరయ్యారు. న్యాయమూర్తి నామాల అశోక్‌ ముగ్గురికి రూ. 2వేల చొప్పున జరిమానా విధించారు. దాంతో పాటు వృద్ధాశ్రమంలో ఉన్న వృద్ధులకు మందుల కొనుగోలుకు రూ.వెయ్యి, పండ్ల కొనుగోలుకు మరో రూ.వెయ్యి చొప్పున చెల్లించాలని తీర్పు ఇచ్చారు. దీంతో ముగ్గురితో కలిసి జడ్జి మున్సిపల్‌ పరిధిలోని కొంపల్లి సమీపంలోని వృద్ధాశ్రమానికి వెళ్లారు. అక్కడ వారితో పండ్లు పంపిణీతో పాటు మందులకు నగదును ఇప్పించారు. అనంతరం వృద్ధుల యోగా క్షేమాలను అడిగి తెలుసుకుని జడ్జి వారికి రూ.10వేల ఆర్థికసాయాన్ని అందించారు.



వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ చేస్తున్న జడ్జి అశోక్‌ తదితరులు

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి



ఘటనాస్థలంలో మల్లేశ్‌ మృతదేహం

తలకొండపల్లి: ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన విషాద ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీకాంత్‌, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చౌదర్‌పల్లికి చెందిన కూరాకుల మల్లేశ్‌(40) బుధవారం ఆమనగల్లు నుంచి బైక్‌పై స్వగ్రామానికి వస్తున్నారు. మార్గమధ్యలో జంగారెడ్డిపల్లి గ్రామ సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న మహేశ్వరం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మల్లేశ్‌ తలకు తీవ్రంగా గాయమైంది. దీంతో ఆయన అక్కడిక్కడే దుర్మరణం చెందారు. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. మృతుడికి భార్య వరలక్ష్మితో పాటు ఇద్దరు పిల్లలున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కల్వకుర్తి ఆస్పత్రికి తరలించారు. మల్లేశ్‌ ఆకస్మిక మృతితో చౌదర్‌పల్లిలో విషాదచాయలు అలుముకున్నాయి.

నిర్మాణాలకు సరైన ఎంపిక 'భారతి'

సంస్థ సీనియర్‌ టెక్నికల్‌ ఇంజనీర్‌ నితీశ్‌యాదవ్‌

అబ్దుల్లాపూర్‌మెట్‌: వ్యాపారంలో తిరుగులేని సంస్థగా ఎదుగుతున్న భారతి సిమెంట్‌ అల్ట్రాఫాస్ట్‌ పేరుతో ఫాస్ట్‌ సెట్టింగ్‌ సిమెంట్‌ 5స్టార్‌ గ్రేడ్‌ను తెలంగాణలో విడుదల చేసిందని ఆ సంస్థ సీనియర్‌ టెక్నికల్‌ ఇంజనీర్‌ నితీశ్‌ యాదవ్‌ తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం రాత్రి రుద్రా స్టీల్‌ ఏజెన్సీ, డీలర్‌ షాప్‌లో తాపీమేస్త్రీలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌తో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ చాలా వేగవంతంగా పూర్తవుతుందన్నారు. అల్ట్రాఫాస్ట్‌ ముఖ్యంగా స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారులకు సరైన ఎంపిక అన్నారు. అల్ట్రాఫాస్ట్‌ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందచేస్తామని స్లాబ్‌ కాంక్రీట్‌ సమయంలో నిపుణులైన భారతి సిమెంట్‌ ఇంజనీర్లు సైట్‌ వద్దకే వచ్చి సహాయపడుతారని ప్రకటించారు. ఈ సందర్భంగా 50 మంది తాపీమేస్త్రీలకు రూ.లక్ష ప్రమాద బీమా బండ్లను అందజేశారు. డీలర్‌ నాగార్జునయాదవ్‌ మాట్లాడుతూ.. భారతి సిమెంట్‌ సర్వీస్‌ చాలా వేగంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేనేజర్‌ మార్కెటింగ్‌ రామకృష్ణ, టెక్నికల్‌ ఆఫీసర్‌ బద్రి, సామ్రాట్‌, తాపీమేస్త్రీలు పాల్గొన్నారు.



తాపీమేస్త్రీలకు బీమా పత్రాలను అందజేస్తున్న భారతి సిమెంట్‌ ప్రతినిధులు

యథావిధిగా నీటి సరఫరా

మల్‌శెట్టిపల్లి తండాలో నీటి సమస్యపై స్పందించిన అధికారులు

బంట్వారం: కోట్‌పల్లి మండల పరిధిలోని మల్‌శెట్టి తండాలో 'గుక్కెడు నీటికి.. గంటల తరబడి కుస్తీ' శీర్షికన మంగళవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మిషన్‌ భగీరథ(గ్రిడ్‌) ఏఈ అనంత్‌రెడ్డి, ఇంట్రా ఏఈ వేణుమాదవ్‌ బుధవారం వేర్వేరుగా మాట్లాడారు. మల్‌శెట్టిపల్లి తండాలో మిషన్‌భగీరథ నీటి సమస్య లేదన్నారు. రెండు రోజుల కిందట తండాకు చెందిన ఒక వ్యక్తి ఇంటిని నిర్మాణం కోసం తవ్వకాలు జరుపగా మిషన్‌ భగీరథ నీటి సరఫరాకు సంబంధించి పైప్‌లైన్‌ లీకయిందన్నారు. తమకు సమాచారం అందిన వెంటనే పైప్‌లైన్‌ సరి చేయించి యథావిధిగా నీటిని తండాకు సరఫరా చేశామన్నారు. అలాగే తండాలోని 5 హెచ్‌పీ బోరు మోటారుకు ఓటర్‌ హెడ్‌ ట్యాంక్‌ వరకు పైప్‌లైన్‌ లేదన్నారు. ఈ క్రమంలో తండావాసులు డైరెక్టు పంపింగ్‌ ద్వారా నీటిని వృథా చేస్తున్నారని ఇంట్రా ఏఈ వేణుమాదవ్‌ తెలిపారు. అలాగే అంగన్‌ వాడీ సెంటర్‌ వద్ద మరో సింగిల్‌ ఫేజ్‌ డైరెక్టు పంపింగ్‌ బోరు మోటారు ఉన్నప్పటికీ తండావాసులు అక్కడ కేవలం బట్టలు వాషింగ్‌ చేయడానికి ఉపయోగిస్తున్నారన్నారు.

సాక్షి ఎఫెక్ట్‌..

ప్రాణం తీసిన ఈత సరదా

బావిలో నీటమునిగి బార్బర్‌ మృతి



సాయి (ఫైల్‌)

మాడ్గుల: ఈత సరదా ఓ యువకుడిని పొట్టన పెట్టుకుంది. లోతు అంచనా తెలియక బావిలో దూకిన అతడు అనంత లోకాలకు వెళ్లాడు. ఈ విషాద సంఘటన మండల పరిధిలోని నల్ల చెరువు గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని బ్రాహ్మణపల్లికి చెందిన నాగిళ్ల సాయి(21) హెయిర్‌ సెలూన్‌ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆయన మంగళవారం ఉదయం తోటి మిత్రులతో కలిసి నల్లచెరువు గ్రామంలో ఉన్న నారాయణబావిలోకి ఈతకు వెళ్లారు. సాయికి లోతు తెలియక దూకడంతో అడుగున ఉన్న ఒండ్రు, కొర్రీల నడుమ చిక్కుకున్నారు. ఎంత సేపటికి సాయి బయటకు రాకపోవడంతో స్నేహితులు కంగారు పడి స్థానికులు, పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే గాలింపు చర్యలు ప్రారంభించి విగతజీవిగా పడి ఉన్న సాయి మృతదేహాన్ని వెలికి తీశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. యువకుడి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

వృద్ధుడి అదృశ్యం



జంగయ్య (ఫైల్‌)

ఆమనగల్లు: పట్టణానికి చెందిన జంగయ్య అనే వృద్ధుడు అదృశ్యమైనట్లు ఆమనగల్లు ఎస్‌ఐ బాల్‌రాం తెలిపారు. పట్టణానికి చెందిన నిఖిల్‌ ఇంటికి జంగయ్య ఈనెల 20న వచ్చాడని, 21న ఉదయం ఇంటిలో నుంచి వెళ్లిన ఆయన తిరిగి రాలేదన్నారు. మనవడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

నిషేధిత పత్తి విత్తనాల పట్టివేత

- ఆటోలో తరలిస్తుండగా పట్టుకున్న ఎస్‌ఓటీ పోలీసులు
- రూ.6 లక్షల విలువ చేసే 240 కిలోల విత్తనాలు స్వాధీనం



దాడిలో పట్టుబడ్డ విత్తనాలు

మొయినాబాద్‌: నిషేధిత పత్తి విత్తనాలను తరలిస్తున్న ఆటోను ఎస్‌ఓటీ, శంకర్‌పల్లి పోలీసులు పట్టుకున్నారు. ముగ్గురిని అదుపులోకి తీసుకుని రూ.6 లక్షల విలువ చేసే 240 కిలోల నిషేధిత విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్‌ పరిధిలో బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం వెలిమల గ్రామానికి చెందిన శివశంకరరావు, శంకర్‌పల్లి మండలం ఎల్వర్తికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి, శంకర్‌పల్లికి చెందిన ఉదయ్‌కిరణ్‌, హరిబాబు నలుగురు వ్యాపారం నిమిత్తం ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలుకు చెందిన విత్తనాల సప్లయర్‌ శ్రీనివాస్‌రావుని కలిసి బీజీ–ఐఐఐ/హెచ్‌టీ(ప్రభుత్వం నిషేధించిన) పత్తి రకం విత్తనాలను కిలో రూ.2,500 చొప్పున రూ.6 లక్షల విలువ చేసే 240 కిలోలు కొనుగోలు చేశారు. వాటిని ఆటోలో తరలిస్తుండగా బుధవారం తెల్లవారు జామున శంకర్‌పల్లి మండలం ఎల్వర్తి సమీపంలో రాజేంద్రనగర్‌ ఎస్‌ఓటీ పోలీసులు, శంకర్‌పల్లి పోలీసులు సంయుక్తంగా దాడి చేసి పట్టుకున్నారు. ఆటో డ్రైవర్‌తోపాటు శివశంకర్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, ఉదయ్‌కిరణ్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న 240 కిలోల నిషేధిత పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పెండింగ్‌ బిల్లులు చెల్లించాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్‌ల సంఘం నాయకులు

- ఆ తర్వాతే గ్రామ పంచాయతీ ఎన్నికలు
- రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం నాయకుల డిమాండ్‌
- ఎన్నికల సంఘం కమిషనర్‌కు వినతిపత్రం

కడ్తాల్‌: రాష్ట్రంలో గత ఐదేళ్లుగా ఎన్నో అభివృద్ధి పనులు చేసినా, నేటికి బిల్లులు అందక సర్పంచ్‌లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు వెంటనే పెండింగ్‌ బిల్లులను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ దగ్గర పడుతున్న నేపథ్యంలో గత సర్పంచ్‌లకు రావాల్సిన బిల్లులు విడుదల చేసిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర నాయకులు బుధవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్‌ పార్థసారథిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. గత ఐదేళ్లుగా గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా వైకుంఠధామాలు, పల్లె ప్రకృతి వనాలు, రైతు వేదికలు, డంపింగ్‌ యార్డులు, సీసీ రోడ్లు, అంతర్గత రోడ్లు, వీధి లైట్లు, అంతర్గత మురుగు కాల్వలు, క్రీడా ప్రాంగణాలు, పారిశుధ్య నిర్వహణ మొదలైన కార్యక్రమాలను చేపట్టడంలో సర్పంచ్‌లు కీలక ప్రాత పోషించారని గుర్తుచేశారు. ఎంతో కష్టపడి గ్రామాలను అభివృద్ధి చేసినా సర్పంచ్‌లకు చెల్లించాల్సిన బిల్లులు విషయంలో ప్రభుత్వం జాప్యం చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. పెండింగ్‌ బిల్లుల విషయమై పలుమార్లు ప్రభుత్వానికి వినతిపత్రాలు అందజేసినా ఫలితం లేదన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం జేఏసీ కమిటీ అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్‌, సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రణీల్‌ చందర్‌, ఉపాధ్యక్షుడు గుంటి మధుసూధన్‌రెడ్డి, నాయకులు అమరేందర్‌రెడ్డి, రమేశ్‌, కరుణాకర్‌, రామకృష్ణ, శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

పైన పటారం.. లోన లొటారం

- హోటళ్లలో ఫుడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీలు
- లోపించిన పరిశుభ్రత
- గడువు ముగిసిన ఆహార పదార్థాలు



హోటల్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న ఫుడ్‌సేఫ్టీ అధికారులు

బంజారాహిల్స్‌: సోమాజిగూడలోని పలు హోటళ్లలో ఫుడ్‌సేఫ్టీ టాస్క్‌ఫోర్స్‌ టీమ్‌ అధికారులు బుధవారం తనిఖీలు చేపట్టారు. సోమాజిగూడ కృతుంగ ది పాలేగర్స్‌ క్యూజిన్‌ రెస్టారెంట్‌లో తనిఖీలు నిర్వహించి లైసెన్స్‌, లోగో లేకుండా గంగా గోల్డ్‌ పన్నీర్‌ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. గడువు ముగిసిన మెంతి మలాయి వాడుతున్నట్లు గుర్తించారు. 156 వాటర్‌ బాటిళ్లను నిబంధనలకు విరుద్ధంగా వినియోగిస్తుండటంతో సీజ్‌ చేశారు. నాన్‌ వెజ్‌ పేస్ట్‌తో పాటు ఇతర ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. పరిశుభ్రతను బేఖాతర్‌ చేస్తూ ఇష్టానుసారంగా హోటల్‌ కొనసాగుతున్నట్లుగా గుర్తించారు. అలాగే.. సోమాజిగూడలోని రెస్ట్‌ ఓ బార్‌లో కూడా తనిఖీలు చేసిన అధికారులు నిబంధనలు పాటించకుండా వాడుతున్న పలు ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. కిచెన్‌లో పరిశుభ్రత పూర్తిగా లోపించినట్లుగా గుర్తించారు. మెడికల్‌ ఫిట్‌నెస్‌ సర్టిఫికెట్‌ లేదని కూడా తేలింది. వెజిటేరియన్‌, నాన్‌ వెజిటేరియన్‌ పదార్థాలు ఫ్రిజ్‌లో ఒకేచోట భద్రపరిచినట్లుగా తేలింది. సింథటిక్‌ ఫుడ్‌ కలర్స్‌ వినియోగిస్తున్నట్లు కూడా గుర్తించారు. కేఎఫ్‌సీలో కూడా అధికారులు తనిఖీలు నిర్వహించి ఫుడ్‌సేఫ్టీ లైసెన్స్‌ను గుర్తించిన చోట ప్రదర్శించకుండా నిర్లక్ష్యం వహించారని నోటీసులు ఇచ్చారు. ఈ హోటళ్లన్నీ పరిశుభ్రత లేకుండానే కిచెన్‌లో ఆహార పదార్థాలను తయారు చేస్తున్నారని, అధ్వానంగా ఉన్నట్లు కూడా అధికారుల తనిఖీల్లో వెల్లడైంది. ఆయా హోటళ్లకు అధికారులు నోటీసులు జారీ చేశారు. పలు ఆహార పదార్థాలను సీజ్‌ చేశారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

పలు చోట్ల వ్యవసాయాధికారుల తనిఖీలు

తాండూరు రూరల్‌: ఫర్టిలైజర్స్‌, ఫెస్టిసైడ్‌ యజమానులు నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని వికారాబాద్‌ ఏడీఏ వినోద్‌కుమార్‌ హెచ్చరించారు. బుధవారం పట్టణంతో పాటు మండలంలోని పలు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలని యజమానులను ఆదేశించారు. రైతులు రసీదులను జాగ్రత్తగా పెట్టుకోవాలని సూచించారు. ధరల పట్టికను బోర్డుపై రాసి ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ రుద్రమూర్తి, ఏఓ రజిత ఉన్నారు.



తాండూరు రూరల్‌: ఫర్టిలైజర్‌ దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

రసీదు తప్పనిసరి

పరిగి: రైతులు కొనుగోలు చేసే మందులు, ఎరువులు, విత్తనాలకు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని కొడంగల్‌ ఏడీఏ శంకర్‌ సూచించారు. బుధవారం పట్టణ కేంద్రంలోని పలు ఫర్టిలైజర్‌ దుకాణాలను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే వ్యవసాయధికారులకు సమాచారం అందించాలని సూచించారు. రైతులు తప్పకుండా దుకాణాల్లో పరిశీలించి విత్తనాలను కొనుగోలు చేయాలని తెలిపారు. నిషేధిత మందులు విక్రయించిన లైసెన్స్‌ను రద్దు చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయధికారి ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర వివరాలు ఉండాలి

పెద్దేముల్‌: రైతులకు నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని వికారాబాద్‌ సహాయ సంచాలకులు వినోద్‌కుమార్‌ అన్నారు. బుధవారం మండలంలోని మంబాపూర్‌తో పాటు పలు గ్రామాలల్లో ఎరువుల దుకాణాలను తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ఎలాంటి విత్తనాలను కొన్నా సమగ్ర వివరాలతో రసీదులు ఉండాలన్నారు. రసీదు లేకుండా విక్రయాలు చేస్తే దుకాణాల లైసెన్సలు రద్దు చేస్తామన్నారు. అంతేగాకుండా రోజు వారి స్టాక్‌ పట్టికను ఉంచాలన్నారు. తనిఖీలో ఏఓ నజీరోద్దిన్‌ తదితరులు పాల్గొన్నారు.

నిషేధిత విత్తనాలు

బషీరాబాద్‌: ఫర్టిలైజర్‌ షాపుల్లో నిషేధిత విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వికారాబాద్‌ షాపుల యజమానులను తాండూరు ఏడీఏలు వినోద్‌ కుమార్‌, రుద్రమూర్తి హెచ్చరించారు. బుధవారం మండలంలోని పలు ఎరువుల దుకాణాలను వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులకు అవసరమైన యూరియాతో పాటు అన్ని రకాల ఎరువులను అందుబాటులో ఉంచుతున్నామన్నారు. కార్యక్రమంలో ఏఓ సూర్యప్రకాష్‌, ఏఈఓలు పాల్గొన్నారు.



పరిగి: రికార్డులు పరిశీలిస్తున్న అధికారి



పెద్దేముల్‌: మంబాపూర్‌లో..



బషీరాబాద్‌: షాపులో తనిఖీలు..